# "అమ్మా... నేబళ్లోకెల్తానే!"

= కె. తాయారమ్మ =

"**ఓలమ్మా!** నాను బళ్ళో కెల్తానే!" చింపి పీలికలై ఒంటికి వేలాడుతున్న గౌనుతో ముక్కు తుడుచుకుంటూ అంది పెంట.

పేడ పిసికి పిడకలు పెడుతూన్న యాదమ్మ ఆశ్చర్యంగా కూతురి వైపు చూస్తూ, "ఏటే బళ్ళో కెల్తావా? నీకు సదూలు కావలసొచ్చాయా — సదూలు?" అంది వెటకారంగా.

"సత్రాజు గోరి లచ్చి, ఎల్లప్ప గోరి దుర్గికూడ బళ్ళో కెల్తన్నారు! నానూ ఎల్తానే!" గునిసింది పెంట.

"ఏటే, గుంటా, వాగుతున్నావు? నువ్వు సదూల సదివి వోర్ని ఉద్ధరించాల? డాకోటేరు అయిపోదామనా? కలికి టేరు అయిపోదామనా? ఈ సదూలు నీకు కూడు ఎడ్తాయటే? సదూకున్న మా రాజులకే లేవే ఉజ్జోగాలు! ఆళ్ళకి కడుపు నిండా కూడే నేదు! ఇంక నీ లాంటోళ్ళు సదూలు ఎలగ జెడితే ఆడగక్కరనేదు!" సణుగుతూ పేడ ముద్దలు తీసి గోడమీద టపీ టపీమని పిడకలు పెడుతూంది యాదమ్మ.

"వూ. వూ. నాను బళ్ళో కెల్తానే"! ఏడుపు లంకించుకుంది పెంట.

"గుంట నంజా! సెప్తుంటే ఇనపట్టంలా? మొండితనం ఏడ నేర్చినావు?" అంటూ పేడ చేత్తోనే పెంటని లాగి దబీ దబీమని దాని వీపుమీద రెండు గుద్దింది యాదమ్మ.

పెంటలో నిస్సహాయత చోటు చేసుకుంది.

ఒంటిని అంటిన పేడని తుడుచుకుంటూ నిలుచుంది.

దానికి ఏడేళ్ళు.

తల్లి వెనుకే చిన్న తట్ట పట్టుకుని పేడ కళ్ళు ఏరుతూ ఉంటుంది. దానికి ఈ జీవితం మీద రోతగా ఉంది.

ఆకుపచ్చ,నీలం,ఎరుపు రంగుల్లో బట్ట లేసుకుని బళ్ళో కెళ్ళే పిల్లల్ని చూస్తూ ఉంటే దానిక్కూడా అలా వెళ్ళాలని ఉంటుంది. తను వాళ్ళలో ఒకతై నట్టు రంగుల కలలు కంటూ ఉంటుంది అప్పుడప్పుడు.

ఆలోచిస్తూ నిలుచుంది పెంట.

"ఏటే అట్టా నిలుచున్నావు? లెగు లెగు! సిన్ని గాణ్ణి తియ్యి!" అంటూ కేక లేసింది యాదమ్మ.

అంతవరకూ తల్లితో సమంగా పేడలో చేతులు పెట్టి పిసుకుతున్న రెండేళ్ళ సిన్నిగాణ్ణి తీసి ఎత్తుకుంది.

యాదమ్మ చేతులు కడుక్కు వచ్చింది.

వూరుకి కొంచెం దూరంలో ఉన్న పాడు పడిన ఇంటి గోడల మీద పిడకలు పెడుతుంది యాదమ్మ.

ముగ్గురూ గుడిసె వైపు నడిచారు.

సూర్యచంద్రులకి, చుక్కలకి నివాస స్థానంలా ఉందా గుడిసె.

కుండలో కొంచెం గంజి ఉంటే పోసింది పిల్లలిద్దరికీ. యాదమ్మ కళ్ళల్లో నీళ్ళు తిరిగాయి.

"ఏటో ఎంత కట్టపడినా గుంటల కుసింత కూడెట్ట నేకపోతూంది ఎదవజనమ!' ' ఇంతలో దానికి ఒక సంగతి గుర్తొచ్చింది.

పెంటకి పని దొరికింది.

దీనితో దాని కడుపన్నా నిండుతుంది.

పెంట వీపు నిమురుతూ అంది యాదమ్మ. "ఒలే పెంటా నీకు పని దొరికిందే! సిన్న బజారులో ఉన్న వకీలుగారింట్లో సంటిబిడ్డ నెత్తుకోవాలంట! ఆ బాబూ, అమ్మా ఇద్దరూ ఉజ్జోగాల కెల్లి పోతా రంట! ఒక్క పూట కూడెడతారు. పది రూపాయిలిత్తారు! రేపే పన్లో సేరుదువు కాని." చింకి చాప పరిచి పెంటని పడుకో పెట్టింది. ఏదో తృప్తి నిండుకుంది యాదమ్మ మనసులో.

"ఆడు సచ్చిపోయిన్నాటి నించి ఈ గుంటల్ని ఎలా పెంచుకొత్తుందో అ దేవుడికే ఎరుక!"

మొగుడు రాములు రిక్షా తొక్కేవాడు. ఏదో లారీ రిక్షాని గుద్దిలది. రాములు అక్కడి కక్కడే సచ్చాడు. ఎందరో అన్నారు.

"ఒలే యాదమ్మా మారుమనువెళ్ళే!" అని. కాని, గుంటలు సత్తారని ఆ సంగతి ఇడిసి పెట్టింది.

ఆలోచనల మధ్య ఎప్పుడో నిద్దరో పట్టింది యాదమ్మకి.

మర్నాడు వకీలు గారింటికి పెంటని వెంట పెట్టుకెళ్ళింది యాదమ్మ.

"ఇంత చిన్న పిల్ల బిడ్డని ఏంఎత్తుకుంటుంది?" అంటూ ఆశ్చర్యపోయారు వాళ్ళు.

"మా గుంటణ్ణి ఇదేఎత్తుకుంటూంది బాబులూ" అంటూ వాళ్ళని ఒప్పించింది యాదమ్మ.

పనిలో కుదురుకుంది పెంట.

● ● ● ●

బాబుని ఎత్తుకుని వీధిలో నిలబడింది పెంట. బలంగా, బరువుగా ఉన్నాడు బాబు. వాణ్ణి ఎత్తుకో లేకపోతూంది పెంట. చేతిలోంచి జారిపోతున్నాడు వాడు.

రోడ్డు మీదికి దృష్టి సారించింది పెంట. ఆకుపచ్చ, నీలి, తెలుపు రంగుల బట్టలలో బడి కెళ్ళి పోతున్నారు పిల్ల లంతా. ఒక చేతిలో పెట్టె, ఇంకో చేతిలో బుల్లి కారేజీలు పట్టుకుని నడిచి పోతున్నారు. కళ్ళు వెడల్పు చేసి చూస్తూంది పెంట వాళ్ళని. "తనుకూడా అట్నా బళ్ళో కెల్తే?" అనుకుంది కాని, తల్లి అందుకు ఒప్పుకోడంలేదు. "నువ్వు బళ్ళో కెళ్తే నిన్ను వోరు పోసిత్తారే?" అంటూ కసురుకుంటూంది.

పెంట కళ్ళలో నీళ్ళు తిరిగాయి.

"తనెందుకు బడికి కెళ్ళకూడదు? తనకీ, ఆళ్ళకీ తేడా ఏటి?"

లోపలి కోసారి తొంగి చూసింది.

అమ్మగారూ, అయ్యగారు అన్నాలు తింటున్నారు. టేబుల్ మీద అనేక పదార్థాలు ఉన్నాయి.

పెంట కడుపులో పేగు లుండ చుట్టుకుపోతున్నాయి. కళ్ళు తిరిగినట్టనిపిస్తున్నాయి. అవి తన కిస్తే బాగుణ్ను! అక్కడి కెల్తేనే అమ్మగారూ, అయ్యగారూ ఎర్రగా చూస్తారు తనని. తనకి ఆక లెయ్యదా?

"ఆక లేస్తేనా ఆళ్ళన్నీ తింటారు! ఆక లేసినా తన కేటీ ఉండవు! ఏ మద్దేన్నమో కుసింత అన్నం ఏత్తారు. అదేనా సద్దెన్నమో, పాడన్నమో!"

పెంట కళ్ళల్లో నీళ్ళు తిరిగాయి.

ఎందు కీ తేడాలు?

ఒక్కసారి తల్లి మాటలు గుర్తొచ్చేయి పెంటకి. "ఒలె పెంటా ఆళ్ళంతా గొప్పోళ్ళే! మన చేత పనంతా సేయించుకుని తరువాత మనల్ని పెంట తుడిచి కుప్ప తొట్టెలో పారబోసినట్టు పారబోత్తారే అవి. మరి తనని ఎందుకు అలాటి గొప్పోళ్ళ దగ్గరకు పంపిత్తుండాది? చక్కగా బడికి పంపచ్చుగా? ఆ చిన్ని బుర్రకి అంతకన్న ఆలోచన తట్టలేదు.

అమ్మగారూ, అయ్యగోరు జోళ్ళతో శబ్దం చేస్తూ వచ్చి, "ఒసే పెంటా అలా వీధిలో నిలబడి ఏం చూస్తావు? ముందు లోపలి కెళ్ళు! పిల్లవాడు జాగ్రత్త!" అంటూ రిక్షా ఎక్కి వెళ్ళిపోయారు.

ఉస్సురని నిట్టూర్చింది పెంట.

బాబు కెంకపట్టి ఏడుస్తున్నాడు.

పాలు కలిపి వాడికి పట్టింది పెంట.

పాలు తాగి హాయిగా నిద్ర పోయాడు బాబు.

దానికి ఒక్కసారి ఇంటి దగ్గరున్న తమ్ముడు గుర్తొచ్చాడు. వాడు ఎప్పుడూ ఆకలితో ఏడుస్తూ ఉంటాడు. వాడికి ఇలాటి పాలుండవు. ఉప్పు రాళ్ళు వేసి గంజి పడుతుంది తల్లి వాడికి. ఒకోసారి అదికూడా ఉండదు. అలాటప్పుడు తల్లి వాణ్ణి దభీ దభీ బాదడం తనకి తెలుసు. ఆడుకూడా బాబులా ఎందుకు బతకక్కూడదు?

బాబుకి ఖరీదైన బిస్కట్లు ఇస్తారు అమ్మగారు అయ్యగారు. అవన్నీ బాబు సరిగ్గా తినడు. చొంగలో తడుపుతాడు. ఆ చిన్న చిన్న ముక్కలన్నింటిని జాగ్రత్తగా ఏరి కాయితంలో కట్టి సాయంత్రం ఇంటి కెళ్ళినప్పుడు తమ్ముడికి ఇస్తుంది.

అందుకే వాడు తన కోసం ఆశగా చూస్తూ ఉంటాడు సాయంత్రం పూట.

కొన్ని రోజులు గడిచాయి.

బాబు బాగా అల్లరి నేర్చాడు. పెంట వాణ్ణి సందడించ లేకపోతూంది. ఇంట్లో వస్తువులన్నీ చిందర వందర చేస్తాడు. వీధి గడప దాటి వెళ్ళిపోతాడు. అనుక్షణం అమ్మగారూ, అయ్యగారూ చీవాట్లు పెడుతూంటారు పెంటని. వంట మనిషి మొదలు పనివాడి వరకు పెంటమీద అజమాయిషీ చేస్తూ ఉంటారు. ఎందుకీఏదవ జనమ? అనుకుంది పెంట ఎన్నోసార్లు. దాని అర్థం పెంటకి తెలీదు. కాని తల్లి ఎన్నో సార్లు అలా అనుకోవడం వింది.



దినచర్య సాగిపోతూంది.

ఒక రోజు పది గంటల వేళ పెంట వీధిలో నిలబడింది. బాబు ఆటవస్తువులు పట్టుకుని గదిలో ఆడుకుంటున్నాడు. అమ్మగారు, అయ్యగారు ఆఫీసు కెళ్ళే తొందరల్లో ఉన్నారు. రోడ్డు మీద రంగు రంగుల దుస్తులతో వెళ్ళి పోయే పిల్లల్ని చూసి



ఫోటో: ఎల్.ఆర్.గ్రోవర్

మురిసి పోతూంది పెంట. ఎప్పుడో తల్లి చెప్పినట్లు గుర్తు. "ఒలే పెంటా పెనోరనాడు బడి పిల్ల లాతా రంగు(రంగుల గుడ్డ లేసుకుంటారే!" అని.

ఆలోచిస్తూ నిలుచుంది పెంట.

ఇంతలో ధఢీమన్న శబ్దం. ఆ వెనువెంట కెవ్వు మన్న ఏడుపు వినిపించాయి. చివ్వున అటు చూసింది పెంట. బాబు మెట్ల మీదించి కిందికి దొర్లి పడ్డాడు.

భయంగా చూస్తాంది పెంట.

ఇంట్లోంచి అమ్మగారు అయ్యగారు వచ్చారు. బాబుని గబుక్కున తీసి ఎత్తుకున్నారు అమ్మగారు. ఎంత పొగరే నీకు?" అంటూ అయ్యగారు పెంటని గట్టిగా బాదారు.

గట్టిగా తిట్టి వీధిలోకి గెంటారు పెంటని వాళ్ళిద్దరు.

యాదమ్మ వచ్చి బతిమాలుకుంది. అయినా లాభం లేకపోయింది.

పెంట పని పోయింది.

నాలుగు రోజులు దొర్లాయి. పెంట పేడతట్ట పట్టుకుని రోడ్డు మీద నడుస్తోంది. రెండురోజులై తిండిలేకపోవడం చేత కలిగిన నీరసం దాన్ని నడవ నియ్యటం లేదు.

గవర్రాజు కిళ్ళీ కొట్టు దగ్గరకొచ్చి కూలబడింది. గవర్రాజు పేపరు చదివి అందరికీ వినిపిస్తున్నాడు. "గవర్రాజా! వార్త లేటి?" అంటూ అందరూ అతని చుట్టూ చేరుతున్నారు.

పెంట కూడా వింటోంది వాటిని. వో వార్త దాని చెవులకి అమృతంలా వినిపించింది. మళ్ళామళ్ళా అడిగి తెలుసుకుంది దాన్ని. దానిలో కొత్త ఉత్సాహం పుంజుకుంది. గబగబ ఇంటికి నడిచింది.

యాదమ్మ పిడకలు పెడుతోంది.

పేడ తట్ట కింద పడేసి, తల్లి ఎదురుగా వెళ్ళి— "సోలమ్మ! నాను బల్లో కెల్తానే!" అంది.

యాదమ్మ విడ్డూరంగా చూసింది. "ఏటే నీకు మళ్లా పిచ్చెక్కిందేటి? బంగారంనాటి పని ఒగ్గేసుకున్నావు. నా పృత్తేగాని నీకు బుద్ధిరాదే!" యాదమ్మ కళ్ళల్లో నీళ్ళు చిప్పిల్లాయి.

పెంట అదోలా చూసింది తల్లివైపు. ఎలాగైనా తల్లికి ఆ సంగజ్జెప్పా లనుకుంది. "ఇనోలమ్మ!" అంది.

యాదమ్మ కూతురి వైపు చూసింది.

"గవర్రాజు కొట్టుకాడ వోర్తలు సదూతూఉంటే ఇన్నాను— బడికెల్లే పిల్లలకి మద్దేన్నం బువ్వెడతా రంట!" అంది పెంట.

పెంట బళ్ళో కెళ్ళడానికి ఒప్పుకుంది యాదమ్మ. ఏ ధర్మ తల్లులో ఇచ్చిన ఒకటి రెండు పాత గౌన్లు పెట్టె అడుగున దాచి ఉంచింది. అవి తీసి చిన్న చిన్న చిరుగులు ఉంటే వాటిని కుట్టి పెంటకి తొడిగింది.

పెంట బడికి వెళ్ళొస్తోంది.

దానికి ఒక పూట కడుపు నిండుతోంది.

రోజూ సాయంత్రం బడినించి రాగానే బడిలో సంగతులన్నీ తమ్ముడు చిన్నిగాడికి చెప్తూ ఉంటుంది—"ఒరే సిన్నిగా! టీచరమ్మ మంచి మంచి కతలు సెప్తుందిరా! టీచరమ్మ శానా మంచిదిరా, తమ్ముడూ!" అని.

వాటన్నింటిని ఆసక్తిగా వాడు వింటాడు.

వాడి కళ్ళల్లో ఎన్నో మెరుపులు.

"అప్పా! నాను బళ్ళోకొత్తానే!" రెండేళ్ళ చిన్ని గాడికి మాటలు బాగానే వచ్చాయి.

"ఇప్పుడు నువ్వు రాకూడదురా, సిన్నిగా! పెద్దోడి వైంతర్వాత రావచ్చు" అంది పెంట వేళ్ళు లెక్కించుకుంటూ.

"అంటే ఎప్పుడు?"

"మరి మూడేళ్ళు పోయినాక." ధర్మ రహస్యం చెప్పినట్టు చెప్పింది పెంట,

వాడు మాట్లాడకుండా వూరుకున్నాడు.

• • • •

చిన్నిగాడికి రెండ్రోజులై జ్వరం వస్తోంది. అసలే పేదరికం. అందులో జ్వరం. అన్నం దొరకడం లేదు వాడికి. పేగులు నకనకలాడుతున్నాయి. వాడిది ఆకలి జ్వరం.

యాదమ్మ పొద్దున్ననగా కూలికిపోయి రాత్రికి ఇంటికి వస్తోంది. వూరికి ఐదుమైళ్ళ దూరంలో ఎక్కడో రాళ్ళు కొడుతూ ఉంటే అక్కడికి వెళ్తోంది కూలికి.

తల్లి వచ్చేవరకూ అక్క చెప్పే కబుర్లు వింటూ ఉంటాడు చిన్నిగాడు.

ఆ రోజు యాదమ్మ వచ్చేసరికి రాత్రి తొమ్మిది గంట లయ్యింది.

అప్పటికే పెంట నిద్రపోయింది.

చిన్నిగాడు మంచం మీద కూర్చున్నాడు.

తల్లిని చూసేసరికి వాడి కళ్ళల్లోకి ఎలు గొచ్చింది.

"వోలమ్మ! అప్ప నిద్ద రోయిందే! నాకు బయ మేత్తుండాదే!" అన్నాడు.

వాణ్ణి ఎత్తుకుంది యాదమ్మ.

వాడి ఒళ్ళు కాలిపోతోంది.

"నాలాంటి పాపిష్టిదాని కడుపున పుట్ట కూడదురా, సిన్నిగా" అంటూ తనతో తెచ్చిన చిన్న రొట్టె ముక్క వాడికి ఇచ్చింది యాదమ్మ.

దాన్ని ఆవురావురుమని తిన్నాడు వాడు.

ఆ చిన్ని రొట్టె వాడి కడుపు నింపలేదు.

చిన్నిగాణ్ణి మంచం మీద పడుకో పెట్టి తాను కూడా వాడి పక్కనే పడుకుంది యాదమ్మ. రేపైనా ఈణ్ణి ఆసుపత్రికి తీసికెళ్ళాలి! అక్కడ ఏ రంగు నీళ్ళన్నా పోత్తే కొంచెమేనా యీడికి జ్వరం తగ్గు తాది!" అనుకుంది నిద్దర్లోకి జారిపోతూ.

"అమ్మా!" పిలిచాడు చిన్నిగాడు.

"ఏట్రా?"

"నా నెప్పుడు పెద్దోణ్ణవుతానే?" ఈ ప్రశ్నకి త్రుళ్ళిపడింది యాదమ్మ.

"ఏట్రా పెద్దోడివయిపోవాల నుందా? పెద్దోడి వైతే ఏటి సుకపడాల? మావంతా ఏటి సుకపడు తున్నావు?" అంది.

"అదికాదే. నా కైదేలు ఎప్పుడొత్తాయె?"

"ఎందుకురా, సిన్నిగా?"

"వాను బళ్ళోకెల్తానే!"

"కోరి నీ తెలివి దొంగలోల్దిలా! నీకూ సదూలు కావల సొచ్చేయేట్రా?" అంటూ నవ్వింది.

"సదూలు కాదే!"

"మరేటి?"

"బళ్ళోకెల్తే బువ్వెడతారే!" చిన్నిగాడు ఉత్సా హంగా చెప్పాడు.

యాదమ్మ కన్నుల నుండి వెచ్చటి నీటి బిందు వులు జారి పిల్లలిద్దరి మీద పడ్డాయి. *